సాక్షి హనుమకొండ

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



సింగిల్ పట్టి @ రూ.67 వేలు

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన మిర్చి రకాల్లో సింగిల్ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాలుకు రూ.67 వేలు ధర పలికింది. - 8లో



ఐపీఎల్ జోరు.. బెట్టింగ్ హుషారు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ నడుస్తోంది. బిట్ కాయిన్ల రూపంలో బెట్టింగ్ దందా నడుస్తున్నట్లు తెలుస్తోంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
$36^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఎండతీవ్రత ఉంటుంది.



న్యూస్‌రీల్

కోవిడ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



ఎంజీఎం: కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు సూచించారు. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో, శుభకార్యాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని పేర్కొన్నారు. ఎవరైనా జలుబు, జ్వరం, దగ్గు అధికంగా ఉన్నట్లయితే కోవిడ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తరచూ చేతులు కడుక్కోవాలని కోరారు.

రిజిస్ట్రేషన్ల జోరు

- 128 దస్తావేజులు.. రూ. 68 లక్షల ఆదాయం
- వరుసగా మూడు రోజులు సెలవులు



కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వోలో గురువారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. శుక్రవారం గుడ్ ఫ్రైడే, శనివారం రెండవ శనివారం, ఆదివారం వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో భూక్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ల కోసం తరలివచ్చారు. సాధారణంగా రోజుకు 60 నుంచి 80 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల ఆదాయం ఖజానాకు అందుతుంది. కానీ గురువారం 128 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా రూ.68 లక్షల ఆదాయం వచ్చింది.

30 ఎకరాల మేర శ్యామల చెరువు కబ్జా

- కలెక్టర్‌కు నీటిపారుదలశాఖ అధికారుల నివేదిక

హసన్‌పర్తి: నగరంలోని 55వ డివిజన్ భీమారం శ్యామల చెరువు 30 ఎకరాల మేర కబ్జాకు గురైనట్లు నీటి నీరుపారుదలశాఖ అధికారులు గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందించారు. చెరువు కబ్జాకు గురైనట్లు ఇటీవల స్థానిక కార్పొరేటర్ జక్కుల రజితతోపాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్.. జాయింట్ సర్వేకు ఆదేశించారు. సర్వే నంబర్ 642లో 67.20 ఎకరాల విస్తర్ణంలో ఉన్న చెరువుశిఖాన్ని నీటి పారుదలశాఖ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. 30 ఎకరాల మేరలో కొంతమంది రియల్టర్లు శిఖాన్ని ప్లాట్లుగా విభజించారని, వందకు పైగా పక్కా భవనాలు ఉన్నట్లు నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం.

బొగ్గు గూడ్స్ రైలు వ్యాగన్‌లో మంటలు



కాజీపేట రూరల్: బొగ్గు గూడ్స్‌రైలు వ్యాగన్‌లో మంటలు రావడంతో రైల్వే అధికారులు అప్రమత్తమై కాజీపేట జంక్షన్‌లో నిలిపివేశారు. మంటలు వచ్చిన వ్యాగన్‌ను తొలగించి బండిని పంపించారు. ఈ ఘటన గురువారం జరిగింది. కాజీపేట రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. బల్లార్షా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బొగ్గులోడ్ గూడ్స్ వ్యాగన్‌లో మార్గమధ్యలో పొగ, మంటలు వచ్చాయి. సమాచారం అందుకున్న కాజీపేట రైల్వే అధికారులు ఆ రైలును కాజీపేట జంక్షన్‌లో నిలిపి మంటలను ఆర్పారు. ఆ వ్యాగన్‌ను తొలగించి రైల్వేయార్డులో పెట్టారు. వేసవి కాలం కావడంతో ఉష్ణోగ్రత అధికంగా పెరిగి బొగ్గు రాపిడీకి కెమికల్ రియాక్షన్ అయి పొగ, మంటలు వ్యాపించాయని రైల్వే అధికారులు అంటున్నారు. సకాలంలో గుర్తించడంతో పెద్ద అగ్నిప్రమాదం తప్పినట్లయిందని రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

కేఎంసీకి రీసెర్చ్ యూనిట్

- అనుమతిస్తూ రూ.1.25 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- మరో మైలురాయి చేరుకున్న మెడికల్ కళాశాల
- ఏడాదిన్నరగా చేసిన కృషికి ఫలితం దక్కింది : ప్రిన్సిపాల్ మోహన్‌దాస్
- ఇటీవల రీజినల్ శిక్షణ కేంద్రానికి అనుమతి, సూపర్ స్పెషాలిటీ సీట్ల కేటాయింపు

కాకతీయ మెడికల్ కళాశాల భవనం



ఎంజీఎం: వరంగల్ నగరంలోని కాకతీయ ప్రభుత్వ మెడికల్ కళాశాల (కేఎంసీ) మరో మైలురాయిని అధిగమించింది. 15 రోజుల క్రితం రీజినల్ శిక్షణ కేంద్రం ప్రారంభానికి అనుమతులు రాగా, వారం రోజుల క్రితం సూపర్ స్పెషాలిటీ సీట్లు సాధించుకుంది. ఈ క్రమంలోనే తాజాగా రీసెర్చ్ యూనిట్ ప్రారంభానికి కేంద్రంనుంచి అనుమతులు వచ్చాయి. పదిహేను రోజుల వ్యవధిలో మూడు ప్రత్యేకతలను సాధించుకోవడంతో కేఎంసీ అధికారులు, సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ మెడికల్ కాలేజీకి 2007లో రీసెర్చ్ యూనిట్ మంజూరు చేయాలని అప్పటి ప్రిన్సిపల్ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఆ తరువాత విషయం మరుగునపడింది. ఏడాదిన్నర కాలం నుంచి కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ రీసెర్చ్ యూనిట్ మంజూరు కోసం చేసిన విన్నపం ఎట్టకేలకు ఫలించింది. కేంద్రప్రభుత్వం రూ.1.25 కోట్ల నిధులు మంజూరు చేసి రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడానికి అనుమతినిస్తూ గురువారం కాలేజీకి ఉత్తర్వులు అందజేసింది. ఢిల్లీలోని ఐసీఎంఆర్ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం ఈ రీసెర్చ్ యూనిట్‌లను దేశవ్యాప్తంగా ఐదు మంజూరు చేయగా అందులో ఒకటి సిద్దిపేట మెడికల్ కళాశాలకు, మరోటి వరంగల్ కేఎంసీకి దక్కింది.

15 రోజుల వ్యవధిలో రెండు ప్రత్యేక అనుమతులు

కాకతీయ మెడికల్ కళాశాలలో నెల్స్ (నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు) పథకంలో భాగంగా నెల రోజుల్లో రీజినల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి పూర్తిస్థాయి అనుమతులు లభించి 15 రోజులు గడవకముందే రీసెర్చ్ సెంటర్ మంజూరుపై వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్స్ శిక్షణ కేంద్రం ప్రస్తుతం ఒక్క ఉస్మానియా మెడికల్ కళాశాలలో కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి శిక్షణ కేంద్రాన్ని వరంగల్‌లోనే ప్రారంభించాలని సంకల్పించి రూ.1.50 కోట్ల పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి కేఎంసీకి చేర్చింది. అంతేకాకుండా ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై వైద్యసిబ్బంది, వైద్యులకు అందించే ఈ శిక్షణ కార్యక్రమాలపై 16మంది ప్రొఫెసర్ స్థాయి వైద్యులకు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వస్తే అకస్మికంగా కుప్పకూలే వారిని కాపాడేందుకు శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వైద్యులు జరిపే పరిశోధలకు పూర్తిస్థాయిలో సహకరించే విధంగా రీసెర్చ్ కేంద్రాన్ని సైతం కేఎంసీకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి వైద్యవిద్యార్థుల విద్య బోధనలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కాగా, వారం రోజులక్రితం ఐదు సూపర్‌స్పెషాలిటీ సీట్లు, ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు సాధించకోవడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఏడాదిన్నర కృషి ఫలితం



ఏడాదిన్నర కృషి ఫలితంగా కేఎంసీకి రీసెర్చ్ సెంటర్ మంజూరైంది. ఇక్కడ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుకు 2007లో ఐసీఎంఆర్‌కు అప్పటి ప్రిన్సిపాల్ దరఖాస్తు చేశారు. కొన్ని కారణాల వల్ల దానిని తిరస్కరించారు. 2021 జూన్ నెలలో కేఎంసీ బోధన సిబ్బందితో సైంటిఫిక్ కమిటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అడిగిన అన్ని రకాల నివేదికలను సమర్పించాం. వాటిని పరిశీలించిన కేంద్రం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.కోటితో రీసెర్చ్ యూనిట్ సంబంధించిన పరికరాలు, రూ.25 లక్షలతో సివిల్ పనులు చేసుకోవడానికి అనుమతినిచ్చింది. ఈ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుతో కేఎంసీ, ఎంజీఎంలోని వైద్యులు, వైద్యసిబ్బందికి వివిధ కోర్సుల్లో పరిశోధనలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

విద్యుత్ కాంతులు



విద్యుత్ కాంతులతో వరంగల్ గోవిందరాజుల ఆలయం ధగధగ మెరిసిపోతోంది. మరోవైపు గుట్ట మీదినుంచి చూస్తే నగరంలోని వీధిలైట్లు, గృహాల లైట్లు ఆకాశంలో నక్షత్రాల్లా కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి – సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్

కేసీఆర్ పాలనలో బలహీన వర్గాలకు అన్యాయం

- గండ్ర సత్యనారాయణరావు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న గండ్ర సత్యనారాయణ

శాయంపేట: కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని గాలికి వదిలేసి తీరని అన్యాయం చేశారని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు మండలంలోని గోవిందాపూర్, పెద్దకోడెపాక, జోగంపల్లి, మైలారం గ్రామాల్లో గురువారం ఆయన హాథ్ సే హాథ్ జోడోయాత్ర చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అధికారం చేపట్టిన తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదని, కేసీఆర్ కుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని విమర్శించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.బుచ్చిరెడ్డి, నాయకులు మారపల్లి రవీందర్, చిందం రవి, నిమ్మల రమేష్, మొట్టె కిరణ్, కట్టయ్య, రాజు, రజనీకాంత్, శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్, భద్రయ్య, శ్రావణ్, కిరణ్, కుమారస్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

అతి పెద్ద రాజకీయ పార్టీ బీజేపీ

- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో కోల్ ఇండియా డైరెక్టర్ వి.మురళీధర్ గౌడ్, రావు పద్మ



ధర్మారావును సన్మానిస్తున్న పద్మ, మురళీధర్

హన్మకొండ: ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన అతి పెద్ద పార్టీ బీజేపీ అని కోల్ ఇండియా డైరెక్టర్, పార్టీ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. గురువారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు అకుంఠిత దీక్షతో, కష్టనష్టాలను ఎదుర్కొని కార్యకర్తలు ఎంతో శ్రమించారని వారందరికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులి సరోత్తంరెడ్డి, దేశిని సదానందం గౌడ్, కొండి జితేందర్‌రెడ్డి, గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, పాశికంటి రాజేంద్ర ప్రసాద్, డి.అమర్నాథ్ రెడ్డి, తీగల భరత్‌గౌడ్, కేతిరెడ్డి విజయలక్ష్మి, పుల్యాల రవీందర్‌రెడ్డి, చల్లా జైపాల్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి బెయిల్ రావడంపై హర్షం



హనుమకొండ కోర్టు వద్ద బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: పదో తరగతి హిందీ పరీక్షపత్రం లీకేజీ కేసులో ఏ–1 నిందితుడిగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి హనుమకొండ నాలుగో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం రాత్రి బెయిల్ ఇవ్వడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. హనుమకొండ కోర్టు వద్ద బాణసంచా కాల్చారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, బీజేపీ లీగల్‌టీం, నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ డా.వి.మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, డా.పెసరు విజయ్ చందర్‌రెడ్డి, రావుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన విద్యార్థులు, నమస్కరిస్తున్న సినీహీరో పవన్ కల్యాణ్



ఓరుగల్లుకు కోటి దండాలు

సినీహీరో పవన్ కల్యాణ్

నిట్ వరంగల్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా శుక్రవారంనుంచి మూడు రోజులపాటు జరిగే వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–23ని గురువారం రాత్రి సినీహీరో పవన్ కల్యాణ్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అపజయాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాల పిలుపునిచ్చారు. ఓరుగల్లుకు కోటిదండాలు అంటూ ఈ గడ్డపై అడుగు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. – కాజీపేట అర్బన్

- 8లో

బీఆర్ఎస్‌కు ప్రజలే ‘బలగం’

- చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్

హసన్‌పర్తి: బీఆర్ఎస్‌కు ప్రజలే బలగం అని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నగరంలోని గుండ్లసింగారంలో గురువారం జరిగిన పార్టీ ఒకటి, రెండవ డివిజన్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు రెచ్చగొట్టేలా మాట్లాడితే తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని పురస్కరించుని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, జంగాకుమార్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సింగులాల్, మాజీ కార్పొరేటర్ కల్పన, పీఏసీఎస్ చైర్మన్లు రాజేష్, గోపాల్‌రెడ్డి, వెంకటేష్ మార్కెట్ డైరెక్టర్లు విజయ్, కల్పన, నాయకులు తోట నాగరాజు, మూల దేవేందర్, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.



హసన్‌పర్తి: మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

సన్నాహక సమావేశం

హన్మకొండ: 51,52,59వ డివిజన్ల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం గురువారం హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ శుక్రవారం జరిగే ఈ సమ్మేళనంలో కార్యకర్తల అభిప్రాయాలను పంచుకోనున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మర్రి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఆత్మకూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న పశువుల (ఆవులు, ఎద్దులు)ను టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు గురువారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ రావు, ఆత్మకూరు సీఐ బండారి కుమార్ సిబ్బందితో కలిసి విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు మండలం నీరుకుళ్ల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్లకు చెందిన పి.సాంబశివరావు(వ్యాపారి) స్థానికంగా పశువులను విక్రయించి హైదరాబాద్‌కు తరలిస్తుంటాడు. ఇతనితోపాటు వాహనం యజమాని హైదరాబాద్‌కు చెందిన ఎండీ.రియాజ్, డ్రైవర్ సయ్యద్ ఖలీల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం చిన్నబండిరేవి గ్రామానికి చెందిన సహాయకుడు దండల వెంకటేష్(కూలీ) చెర్ల నుంచి హైదరాబాద్‌కు ఐచర్ వాహనంలో 32 ఎద్దులు, 7 ఆవులను తరలిస్తుండగా నీరుకుళ్ల క్రాస్‌రోడ్ వద్ద గురువారం సాయంత్రం పట్టుకున్నారు. సయ్యద్ ఖలీల్, దండల వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాంబశివరావు, రియాజ్ పరారీలో ఉన్నారు. ఐచర్ వాహనం, రెండు మొబైల్ ఫోన్లు, రెండు కీప్యాడ్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమార్ తెలిపారు.



అక్రమంగా తరలిస్తున్న పశువులు

కమలాపూర్ లైన్‌మెన్ సస్పెన్షన్

హన్మకొండ: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ అజ్మత్ అలీపాషాను సస్పెండ్ చేస్తూ ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ బి.సామ్యా నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అతను అవినీతికి పాల్పడడంతోపాటు విద్యుత్ వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కమలాపూర్ మండలం కన్నూరు సర్పంచ్ రాంచందర్ రావుతో పాటు పలువురు వినియోగదారులు ఇటీవల టీఎస్ ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరిపించగా వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో అతనిపై వేటు వేశారు.

పటిష్ట బందోబస్తు నడుమ పరీక్ష

- టెన్త్ పరీక్షల్లో 20మంది విద్యార్థుల గైర్హాజరు
- ఆ విద్యార్థిని డీబార్ చేశాం : డీఈఓ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి/కమలాపూర్: కమలాపూర్ లీకేజీ ఘటనతో ఇటు విద్యాశాఖ, అటు పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. వరుసగా తెలుగు, హిందీ పరీక్ష పత్రాలుబయటికి రావడం.. హిందీ పరీక్ష పత్రం హనుమకొండ జిల్లాలోనే లీక్ కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద భద్రత పెంచాలని వరంగల్, హనుమకొండ డీఈఓలు వాసంతి, అబ్దుల్ హైలు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కోరిన విషయం తెలిసిందే. దీంతోపాటు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో గురువారం నిర్వహించిన తృతీయభాష (ఇంగ్లిష్) పరీక్షల సందర్భంగా పోలీసుల నిఘా పెంచారు. హనుమకొండ జిల్లా పరిధిలోని 68 పరీక్ష కేంద్రాల్లో పోలీస్ బందోబస్తుతోపాటు విద్యాశాఖేతర వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు కూడా విధులను నిర్వర్తించారు. ఇంగ్లిష్ పరీక్షకు 11,705మందికిగాను 11,685మంది విద్యార్థులు హాజరుకాగా, 20మంది గైర్హాజరయ్యారు. డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఐదు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 21పరీక్ష కేంద్రాలను తనిఖీచేశారు.

పెరిగిన నిఘా

కమలాపూర్ మండల పరిధిలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో గురువారం పటిష్ట బందోబస్తు మధ్య పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌తోపాటు ఒక మండల స్థాయి అధికారి, ఇద్దరు పోలీస్ సిబ్బంది, ముగ్గురు వీఆర్ఏలను నియమించారు. 144 సెక్షన్ అమలు చేశారు. బందోబస్తును ఎస్సై సతీష్ పర్యవేక్షించారు. మూడు పరీక్షకేంద్రాలను ఏసీజీఈ చలపతిరావుతో కలిసి డీఈఓ ఎండీ.అబ్దుల్ హై సందర్శించారు. సీఎస్, డీఓలతో పాటు ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాంకిషన్‌రాజు ఆధ్వర్యంలో బృందం కమలాపూర్‌లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.

ఆ విద్యార్థి డీబార్ : డీఈఓ అబ్దుల్‌హై

కమలాపూర్ జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో ఈ నెల 4న టెన్త్ హిందీ పరీక్ష పత్రం బయటికి వచ్చిన ఘటనలో హరీష్ అనే విద్యార్థిని డీబార్ చేసినట్లు డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు. గురువారం ఆ విద్యార్థి పరీక్ష రాసేందుకు రాగా పిలిపించి మాట్లాడానని, ఆ మైనర్ తనను బెదిరించి ప్రశ్నపత్రం తీసుకున్నట్లు తెలిపాడని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థినుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్నట్లు పేర్కొన్నాడు. అతని హాల్‌టికెట్ తీసుకుని డీబార్ చేస్తున్నట్లు చెప్పినట్లు డీఈఓ చెప్పారు. ఈ విషయాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు, ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



కమలాపూర్ పరీక్ష కేంద్రాలను సందర్శిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

సీఎస్, డీఓలుగా ఎంవీ.శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి

పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం ఔట్టైన ఘటనకు సంబంధించి కమలాపూర్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ మాటూరి శివప్రసాద్, డిపార్ట్‌మెంటల్ అధికారి టి.శ్రీధర్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వారి స్థానంలో శనిగరం మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ ఎంవీ.శ్రీనివాస్‌ను చీఫ్ సూపరింటెండెంట్‌గా, భీంపల్లి మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ ఎం.మధుకర్‌రెడ్డిని డిపార్ట్‌మెంటల్ అధికారిగా నియమించారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడి మృతి



ఘటనా స్థలిలో ప్రసన్నకుమార్ మృతదేహం

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి శివారులో చెట్టుకు బైక్ ఢీకొని అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందాడు. వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని పుప్పాలగుట్టకు చెందిన అప్పికట్ల ప్రసన్నకుమార్(28) జిమ్ కోచ్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి అతడు నల్లబెల్లి శివారులో తన బైక్‌తో చెట్టుకు ఢీ కొనగా పక్కనే ఉన్న కల్వర్టులో పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్తి అమ్మకం విషయంలో జరిగిన తగాదాలతోనే ప్రసన్నకుమార్‌ను మార్టిన్ లూథర్, సర్వే వెంకన్న, బస్వ రాజ్‌కుమార్, హెర్నార్ట్, శిరీష, జిమ్ ప్రవీణ్ హత్య చేసి కల్వర్టులో పడేశారని మృతుడి అక్క ప్రభావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆస్తి తగాదాలకు సంబంధించి గతంలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నడుస్తోందని, ఈ విషయమై సీపీని కలిసినట్లు మృతుడి అక్క తెలిపింది. కాగా.. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా.. వరంగల్–ఖమ్మం రహదారిపై వాహనాన్ని ఆపి మృతుడి బంధువులు ధర్నా చేశారు. వర్ధన్నపేట ఎస్సైలు రామారావు, మంగ మృతుడి బంధువులకు సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

కొట్టుకొచ్చిన మృతదేహం

- మృతుడు హనుమకొండ వాసిగా గుర్తింపు

కేసముద్రం: హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన కొంగ్ర సురేశ్(44) మృతదేహం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాం తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో గురువారం కొట్టుకొచ్చింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆతర్వాత కనిపించకుండా పోవడంతో బంధువులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో సురేశ్ అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఎస్సారెస్పీ కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం భుక్యారాం తండా సమీపంలోని డీబీఎం 48 ఎస్సారెస్పీ కాలువలో వంతెన పిల్లర్‌కు తట్టుకుని ఆగింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కాగా.. తమకు అందిన సమాచారం మేరకు మృతుడు హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్ అనే వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కేయూ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా.. సురేశ్ చింత గట్టు వద్ద ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్సై తెలిపారు.

ఐపీఎల్ జోరు.. బెట్టింగ్ హుషారు

- కమిషనరేట్ పరిధిలో గుట్టుగా బెట్టింగ్
- ఆన్‌లైన్ యాప్‌ల ద్వారానే సాగుతున్న పందెం
- ఈజీమనీ కోసం పెడదారి పడుతున్న యువత
- బిట్‌కాయిన్ల రూపంలో నిర్వాహకుల దందా



సాక్షి, వరంగల్: ఓవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ట్వంటీ20 క్రికెట్ సందడి.. ఈ జోష్‌కు తగ్గట్టుగానే ఆన్‌లైన్‌లో బెట్టింగ్ జోరందుకుంది. హైదరాబాద్ నగరమే కాదు.. ఉమ్మడి వరంగల్‌లోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో క్రికెట్ బెట్టింగ్ అలవాటు అయింది. ముఖ్యంగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి డఫ్ఫాబెట్, 1ఎక్స్‌బెట్, స్కై ఎక్స్ఛేంజ్, ఫ్యాన్సీ లైఫ్, క్రికెట్ మజా, లైవ్ లైన్ గురూ, లోటస్, బెట్ 65, బెట్ ఫెయిర్ వంటి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసి పందెం కాస్తూ నష్టపోతున్నారు. ఇంకోవైపు గ్రేటర్ వరంగల్ సిటీలోని కొన్ని బార్‌లు, రెస్టారెంట్‌ల్లోనూ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టీవీ తెరల ద్వారా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ చూస్తూ ఓ చేత్తో బీర్ కొడుతూనే.. మరో చెత్తో ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తున్నారు. మరికొందరేమో పరిచయస్తులను కలుసుకొని బెట్టింగ్ వేస్తూ మ్యాచ్ ఫలితం రాగానే పైసలు పంచుకుంటున్నారు. ఈ బెట్టింగ్‌పై ఇప్పటికే వరంగల్ పోలీసులు నిఘా ఉంచారు.

బిట్ కాయిన్‌ల రూపంలో..

ఎప్పటి నుంచో క్రికెట్ బెట్టింగ్ దందా చేస్తున్న నిర్వాహకులు నయాటెక్నాలజీకి అనుగుణంగా తమ వ్యాపారం సజావుగా సాగేందుకు సొంతంగా యాప్ తయారుచేస్తున్నారు. వివిధ నగరాల్లో ఉంటున్న బుకీలకు యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు ఇచ్చి నయా దందా చేస్తున్నారు. ప్రధాన నిర్వాహకుడు ఆయా జట్ల విజయాల రేషియోను ఆ యాప్‌లో నిక్షిప్తం చేస్తుండడంతో ఇందుకనుగుణంగా బుకీలు తమ పంటర్లకు చెప్పి దందా సాగిస్తున్నారు. ఇలా బుకీలకు వచ్చిన ఆదాయంలోనే కొంతడబ్బును ప్రధాన నిర్వాహకుడికి అందిస్తున్నారు. ఇది కూడా గుట్టుచప్పుడూ కాకుండా జోరుగా సాగుతోంది. ఈ దందా ఎక్కువగా నమ్మకంతో నగదు రూపంలోనే జరుగుతుండడం గమనార్హం. ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపుల వల్ల పోలీసులకు దొరికే అవకాశం ఉండడంతో బిట్ కాయిన్‌ల రూపంలో బెట్టింగ్ దందా చేస్తున్నట్లు తెలిసింది.

మచ్చుకు కొన్ని..

- హైదరాబాద్, బెంగళూరులోని ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్న వరంగల్ నగరానికి చెందిన విజిగిరి రవి, కొరె రాజయ్య కరోనా మహమ్మారి వచ్చినప్పటి నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. గతేడాది ఐపీఎల్ మ్యాచ్‌లు మొదలుకావడంతో ఆన్‌లైన్ యాప్ డఫ్ఫాబెట్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కాడు.
- రెవెన్యూ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి కుమారుడికి క్రికెట్ అంటే పిచ్చి ఎక్కువ. ఓవైపు ఇంట్లోనే కుటుంబసభ్యులతోనే కలిసి ఆ మ్యాచ్‌లు వీక్షిస్తూ.. మరోవైపు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా రూ.లక్షన్నర వరకు బెట్టింగ్ కాశాడు. ఓరోజు ఆ ఉద్యోగి డబ్బులు డ్రా చేద్దామని ఏటీఎంకు వెళితే ఆ అకౌంట్ నుంచి రూ.లక్షా50వేలు బదిలీ అయ్యాయని తెలవడంతో ఖంగుతిన్నాడు. అనంతరం పోలీసులను సంప్రదించాడు.

బెట్టింగ్‌పై నిఘా ఉంచాం...

ఐపీఎల్ మొదలవడంతో క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా ఉంచాం. తక్కువ వ్యవధిలోనే ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో యువత ఈ మార్గాన్ని ఎంచుకుంటుంది. గతేడాది కూడా జరిగిన బెట్టింగ్ ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత నిఘా ముమ్మరం చేశాం. పిల్లలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచడం ద్వారా బెట్టింగ్ జాడ్యాన్ని కొంతవరకు దూరం చేయవచ్చు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లో నిక్షిప్తం చేసే యాప్‌ల ద్వారానే బెట్టింగ్ సాగుతోంది. ఎక్కడైనా బెట్టింగ్ సాగుతుందన్న సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

– ఏవీ రంగనాథ్, వరంగల్ పోలీసు కమిషనర్

'ఎస్సై' రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్



వరంగల్ క్రైం: ఈనెల 8,9 తేదీల్లో పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రెనీ ఎస్సై (సివిల్/ఏఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఏఆర్ సిపియల్/ఫైర్) అభ్యర్థులకు జరగనున్న రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, రాత పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. ఎస్సై అభ్యర్థుల రాత పరీక్ష కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రెండ్రోజులపాటు నిర్వహించనున్న ఈరాత పరీక్షల్లో నాలుగు పేపర్లు రాత పరీక్షను నిర్వహిస్తామని, ఈ రాత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు 14,380 మంది అభ్యర్థులు హాజరవుతుండగా.. ఇందులో 3,315 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు.

అభ్యర్థులకు ముఖ్య సూచనలు..

- అభ్యర్థి ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- అభ్యర్థి వెంట హాల్‌టికెట్ తెచ్చుకోవాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దు.
- ఓఎంఆర్ షీట్‌పై అనవసర సమాచారం, గుర్తులు, మత పరమైన చిహ్నాలు రాయకూడదు.
- అభ్యర్థులు మెహందీ, సిరా మొదలగునవి వారివారి చేతులపై గాని పాదాలపై గానీ రాసుకుని రాకూడదు.

ఆలిండియా పోటీలకు సాఫ్ట్‌బాల్ జట్టు



జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: పంజాబ్ యూనివర్సిటీలో ఈనెల 5న ప్రారంభమై 9వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టును ఎంపిక చేసి పంపినట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. జట్టులో ఆర్.గంగరాజు, పి.మనోహర్, బి.నవీన్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), బి.సర్దార్, ఎం.అజయ్ (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ), జి.అన్వేశ్, బి.రాజశేఖర్, వి.అజిత్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎస్.తరుణ్ (కిట్స్ వరంగల్), బి.ప్రవీణ్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట), బి.భరత్, ఎం.విక్రమ్, ఎస్.సంతోశ్ (వీసీపీఈ బొల్లికుంట), ఎల్.కళ్యాణ్ (యూపీసీఈ కేయూ, ఖమ్మం), జి.చరణ్‌తేజ, కె.రాజశేఖర్ (ఎస్‌వీఎస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ) ఉన్నారు. జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా హనుమకొండ జిల్లా భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫిజికల్ డైరెక్టర్ ఎ.రవికుమార్ వ్యవహరిస్తున్నారు.

18న రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు



కలెక్టర్‌తో రోషన్ స్వాయ్

ములుగు: ఈనెల 18న ప్రపంచ గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వరంగల్ మేనేజర్, డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ రోషన్ స్వాయ్ అన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.కృష్ణ ఆదిత్యని రోషన్ స్వాయ్, టి.బుచ్చయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈనెల 18న ఇంటర్నేషనల్ మోనుమేంట్స్, సైట్స్ వరల్డ్ హెరిటేజ్ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరగనున్న ఉత్సవాలపై కలెక్టర్‌తో వారు చర్చించారు.

ఆ వాల్ పోస్టర్లు నకిలీవే..

- ప్రకటించిన మావోలు



మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

ఏటూరునాగారం: ఈనెల 3న మండల కేంద్రంలోని చేపల మార్కెట్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీకి వేసిన వాల్ పోస్టర్లు నకిలీవని, తాము వేయలేదని మావోయిస్టు పార్టీ జయశంకర్ మహబూబాబాద్, వరంగల్ పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం లేఖలో పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రాంతంలో అధికార పార్టీ, ఇతర పేర్లతో కొన్ని పోస్టర్లు వేశారని, వాళ్లు కొంత మంది ప్రజావ్యతిరేకులు కూడా ఉన్నారని తెలిపారు. అయితే ఆ పోస్టర్లకు తమకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. అవి నకిలీ పోస్టర్లని, కొంత మంది వ్యక్తిగత కారణాలతో వాటిని వేశారని, ఆ పోస్టర్లు వేసి పార్టీని తిరగనివ్వద్దని పోలీసులే వాటిని వేయించారని లేఖలో పేర్కొన్నారు. అందుకోసం వాటిని ఎవరు నమ్మొద్దని మావోయిస్టు వెంకటేశ్ తెలిపారు.

సింగిల్ పట్టి @ రూ.67 వేలు



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

మార్కెట్‌లో మిర్చి ధరలు ఇలా..

రకం	గరిష్ట	కనిష్ట	మోడల్
తేజ	23,300	17,000	21,000
వండర్‌హాట్	36,000	31,000	33,000
యూఎస్–341	22,500	17,000	20,000
డీడీ	22,500	17,000	20,000
దీపిక	31,000	22,000	27,000
దేశీ	70,000	45,000	65,000
సింగిల్‌పట్టి	67,000	45,000	60,000
1048	23,500	16,500	21,000
తాలు	9,000	5,000	7,000

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన మిర్చి రకాల్లో సింగిల్ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాలుకు రూ.67 వేలు ధర పలికింది. ఈ సీజన్ ప్రారంభమైన తర్వాత సింగిల్ పట్టి రకానికి మొదటిసారి మార్చి 29న గరిష్టంగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. అప్పటి నుంచి రూ.60 నుంచి 65 వేల వరకు ధరలు పలికిన సింగల్ పట్టికి గురువారం రోజున మరోసారి గరిష్ట ధరగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. తేజ రకం మిర్చి ధరలు గత వారం ఉన్న విధంగానే ఉండగా.. వండర్‌హాట్ రూ.500లు, యూఎస్–341 రూ.300లు, దీపిక రూ.1,500లు, సింగిల్‌పట్టి రూ.3వేలు, 1,048 రకానికి రూ.1,500లు క్వింటాలుకు పెరిగినట్లు మిర్చి యార్డు అధికారులు తెలిపారు. మార్కెట్‌కు సుమారు 35 వేల వరకు మిర్చి బస్తాలు యార్డుకు వచ్చినట్లు తెలిపారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

గీసుకొండ: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన కూనమల్ల భిక్షపతి(48) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్షపతి అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడేళ్ల నుంచి సాగు పెట్టుబడులకు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, పెట్టిన పెట్టుబడి రాక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆటోలో వచ్చి ఇంటిముందు పడిపోయాడు. విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

'సీసీ'లో చిక్కకుండా చోరీ!

- బయ్యారం పీహెచ్‌సీలో రూ.65 వేల వస్తువుల అపహరణ



చోరీకి గురైన వస్తువుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ రమాదేవి

బయ్యారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. 24 గంటల పాటు రోగులకు ప్రాథమిక వైద్యం అందించే పీహెచ్‌సీలో బుధవారం రాత్రి ఇద్దరు ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత వాళ్లు లోపల గడియ పెట్టుకొని నిద్రపోయారు. ఈసమయంలో పీహెచ్‌సీలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు పీహెచ్‌సీ ఆవరణలోని సీసీ కెమెరాకు చిక్కకుండా లోపలికి చొరబడ్డారు. సిబ్బంది నిద్రిస్తున్న గది తలుపులకు బయటి నుంచి గడిపెట్టి పీహెచ్‌సీలో ఉన్న 15 వేల విలువైన నాలుగు బ్యాటరీలు, సెటాప్‌బాక్స్, రెండు జోర్‌కర్టెన్స్, ఒక కంప్యూటర్ కీ బోర్డును ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున నిద్రలేచిన ఉద్యోగులు లోపలి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా.. గడియ పెట్టినట్టు గుర్తించి స్థానికులను పిలిచి బయటకు వచ్చారు. ఘటనాస్థలాన్ని సీఐ బాలాజీ, ఎస్ఐ రమాదేవి పరిశీలించారు. కాగా.. పీహెచ్‌సీలో చోరీకి గురైన వస్తువుల విలువ రూ.65 వేలు ఉంటుందని పీహెచ్‌సీ వైద్యులు సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వాతంత్య్ర సమరయోధుడి మృతి



తిరుపతయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. గురువారం తెల్లవారుజామున మండలంలోని తాటికొండకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అక్కినపెల్లి తిరుపతయ్య (98) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామానికి చేరుకుని తిరుపతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.


సాయుధ పోరాట యోధుడు

తిరుపతయ్య ఆరోజుల్లో భూస్వాముల ఆగడాలు, నిజాం నిరంకుశ పాలన, కాశీమ్ రజ్వీ పోలీసులు పేద ప్రజలపై చేసే ధన, మాన, ప్రాణ దోపిడీ చూసి చలించి పెండ్యాల రాఘవారావు దళంలో మొదట సభ్యుడిగా చేరాడు. అనంతరం దళ నాయకుడిగా కొనసాగారు. రోజంతా దళ సభ్యులతో గుట్టల్లో, పొదల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులపై దాడి చేసేందుకు ప్రణాళికలు రూపొందించేవాడు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన తిరుపతయ్య ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేవాడు. అనంతరం వరంగల్, ఖమ్మం, గుల్బర్గా, జాల్నా జైళ్లలో జైలు జీవితం అనుభవించాడు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన తర్వాత సీపీఐ, సీపీఎంలో పని చేశాడు.

పలువురి సంతాపం

తిరుపతయ్య మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని పార్థివదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపారు.

వడదెబ్బతో ఒకరు..



సత్యనారాయణ మృతదేహం

వెంకటాపురం(కె): వడదెబ్బ తగిలి ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధి అంకన్నగూడేనికి చెందిన గట్టు సత్యనారాయణ (55) మృతి చెందాడు. సత్యనారాయణ గురువారం మిర్చి తోటలో కూలీలతో పని చేయిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయాడు. గమనించిన కూలీలు సత్యనారాయణను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.

భార్య గొంతు నులిమి చంపిన భర్త అరెస్ట్



హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో మూడెత్తుల లక్ష్మిని గొంతు నులిమి హత్య చేసిన కేసుల్లో భర్త మూడెత్తుల రమేశ్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాటారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్ మాట్లాడుతూ.. లక్ష్మి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతోనే ఈనెల 5న ఉదయం 4గంటల సమయంలో గొంతు నులిమి చంపినట్లు తెలిపారు. రమేశ్ గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు ఆయన వెల్లడించారు. నేరం ఒప్పుకోవడంతో స్టేట్‌మెంట్ రికార్డు చేసి జ్యూడీషియల్ రిమాండ్ నిమిత్తం భూపాలపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు వెల్లడించారు. ఆయన వెంట కాటారం సీఐ రంజిత్‌రావు, మహా ముత్తారం ఎస్సై సుధాకర్, కానిస్టేబుల్స్ హరికుమార్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

భారతీయత మనల్ని కలుపుతుంది

- సినీ హీరో పవన్ కల్యాణ్
- నేటి నుంచి నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలు



నిట్ క్యాంపస్‌లో మాట్లాడుతున్న సినీ హీరో పవన్ కల్యాణ్

కాజీపేట అర్బన్ : 'కళలకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లుకు కోటి దండాలు. హాలో నిట్ వరంగల్. మీదే ఈ తరం' అంటూ ప్రముఖ సినీహీరో పవన్ కల్యాణ్ యువతలో జోష్ నింపారు. నిట్ వరంగల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ–23 ప్రారంభోత్సవానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్‌స్ప్రీ–23 కల్చరల్ ఫెస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఏకశిలా నగరానికి, రాణి రుద్రమదేవి పాలించిన, పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ, భాగవతం రచించిన బమ్మెర పోతన నడియాడిన ఓరుగల్లుకు రావడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లోని సంస్కృతీసంప్రదాయాలు భారతీయతలోని ఏకత్వం మనల్ని కలుపుతుందని, ఇందుకు నిదర్శనమే నాటు నాటు పాట ఆస్కార్ సాధించడమని పేర్కొన్నారు. నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్ మనల్ని కలిపిందన్నారు. 'నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్ స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలకు అతిథిగా పిలవగా.. నేను రెగ్యులర్ కళాశాలకు వెళ్లిన విద్యార్థిని కాదు, బాగా చదువుకోలేదు. కానీ నిత్యపఠనం చేసే విద్యార్థిని, నేను మీ కళాశాలకు రావడానికి అర్హుడినా?' అని అడిగానన్నారు. 'జీవితంలో షార్ట్‌కట్స్ వెతుకోవద్దు అపజయాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలి' అని అన్నారు. కార్యక్రమంలో నిట్‌డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.